సాక్షి
శ్రీకాకుళం
గురువారం : 10 : జూలై : 2025



అయ్యో అన్నదాత..!

ఈదుపురం ఎత్తిపోతల పథకం మూలకు చేరింది. సీఎం చంద్రబాబు హామీ నెరవేరకపోవడంతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. - 4లో



బరితెగించిన ఆక్రమణదారులు

సంతబొమ్మాళి మండలంలోని పోతునాయుడు పేటలో ఆక్రమణదారులు బరితెగించారు. సాగు నీటి కాలువ, రోడ్డు మధ్య స్థలం కబ్జా చేశారు. - 4లో

కొనసాగుతున్న తనిఖీలు

శ్రీకాకుళం క్రైమ్ : ఆపరేషన్ క్యాంపస్ సేఫ్‌జోన్‌లో భాగంగా జిల్లాలో పలు విద్యాసంస్థలకు వందమీటర్ల పరిధిలో ఉన్న పాన్‌షాపుల వద్ద రెండోరోజు బుధవారం కూడా పోలీసుల తనిఖీలు జరిగాయి. గంజాయి, డ్రగ్స్, పొగాకు, ఖైనీ, గుట్కా వంటి ఉత్పత్తుల క్రయ విక్రయాలు నిరోధించే ఉద్దేశంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.

న్యూస్‌రీల్

నారీ శక్తిపై అవగాహన



శ్రీకాకుళం క్రైమ్ : మహిళల భద్రతే తమ మొదటి ప్రాధాన్యత అని, గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు, విద్యార్థులకు విస్తృత స్థాయిలో అవగాహనపరిచే కార్యక్రమంగా 'నారీ శక్తి' నిలుస్తుందని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో అధికారులు ప్రజలతో మమేకమై మహిళలపై దాడులు, గృహహింస, సోషల్‌మీడియా వేదికగా జరుగుతున్న వేధింపులు శక్తియాప్ ఉపయోగం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. విద్యార్థులు చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని, ఆపద సమయంలో డయల్ 112, సైబర్ టోల్‌ఫ్రీ నంబర్ 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098లకు డయల్ చేయాలని కోరారు.

శాకంబరిదేవిగా నీలమణి



ఆషాఢ మాస ఉత్సవాల్లో భాగంగా అవలింగి నీలమణి ఆలయంలో అమ్మవారిని బుధవారం శాకంబరి దేవిగా అలంకరించారు. అర్చకులు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో వివిధ కూరగాయలు, పండ్లు, ఆకు కూరలతో అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు.

-సారవకోట

కొత్తూరు సీహెచ్‌సీకి రోగుల తాకిడి



వైద్యం కోసం బారులు తీరిన రోగులు

కొత్తూరు: గ్రామాల్లో వ్యాధుల వ్యాప్తి తీవ్రంగా ఉండటంతో కొత్తూరు సీహెచ్‌సీకి రోగులు తాకిడి రోజురోజుకూ ఎక్కువవుతోంది. జ్వరాలు, డయేరియా తదితర వ్యాధులతో కొత్తూరు, భామిని మండలాలకు చెందిన సుమారు 200 మంది రోగులు బుధవారం ఆస్పత్రికి తరలివచ్చారు. సరిపడా గదులు లేక పోవడంతో వరండాలోనే మంచాలు వేసి వైద్యం అందజేశారు. ఎక్స్‌రే యంత్రం లేకపోవడంతో కొందరు ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించారు.

ఆదిత్యన్ నేత్రాలు సజీవం



ఆదిత్యన్(ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రానికి సమీపంలోని తోటపాలెంలో నివాసముంటున్న బి.వి.ఎ.ఆదిత్యన్(84) అనారోగ్యంతో మృతి చెందారు. మరణానంతరం ఆయన నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో కుటుంబ సభ్యులు సాయిరాం, ప్రసన్న, ఎస్.తవిటయ్య విషయాన్ని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేశారు. మగటపల్లి కల్యాణ్ నేత్రసేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి పి.సుజాత, బి.జగదీష్, పి.చిన్నికృష్ణల ద్వారా వృద్ధుడి కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, కార్యదర్శి మల్లేశ్వరరావు, ట్రెజరర్ దుర్గాశ్రీనివాస్, తవుడు అభినందించారు. నేత్రదానం చేయాలనుకునేవారు 78426 99321 నంబరును సంప్రదించాలని కోరారు.

ఒత్తిళ్లు భరించలేకపోతున్నాం

జి.సిగడాం: గ్రామాల్లో ఓవైపు రీ సర్వే, మరోవైపు గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదుల పరిష్కరించే పనుల్లో బిజీగా ఉంటున్నామని, ఈ సమయంలో రాజకీయ నాయకులు ఒత్తిళ్లు తెస్తున్నారని, ఇలాగైతే ఉద్యోగాలు చేయడం కష్టమని జి.సిగడాం మండల వీఆర్‌ఓల సంఘం సభ్యులు పిన్నింటి సింహాచలం, భూపతి నర్సింగరావు, పాట్నూరు జగన్నాథం ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం జి.సిగడాంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామాల్లో నాయకులు, కార్యకర్తల ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో మానసికంగా ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. వేధింపులు ఎక్కువైతే మూకుమ్మడి సెలవులు తప్పవని స్పష్టం చేశారు. సమావేశంలో కుప్పిలి సీతయ్య, సంతోష్‌కుమార్, ముద్దాడ నీలకంఠం, శేఖర్, ఎరకయ్య తదితరులు పాల్గొన్నారు.

● అవస్థల చదువులు

ఎందుకీ సమావేశాలు?



రాష్ట్ర అసెంబ్లీలో విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చెప్పిన అద్భుతమైన బ్యాగ్ ఇదేనట. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇస్తున్న ఈ బ్యాగు విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుని, హ్యాండిల్స్ ఊడిపోకుండా బాగా స్టిచ్చింగ్ చేసి ఇస్తున్నట్టు చెప్పుకొచ్చారు. అయితే, లోకేష్ చెప్పినదానికి భిన్నంగా బ్యాగులు నాసిరకంగా ఉన్నాయి. విద్యార్థులకు ఇచ్చిన కొన్ని రోజులకే చిరిగిపోయాయి. బ్యాగులు కుట్టే వారు వీటిని బాగు చేసే పనిలో బిజీగా ఉన్నారు.



పాఠశాలలో పెడుతున్న భోజనంలో పురుగులు ఉన్నాయని ఓ విద్యార్థి చూపిస్తున్న దృశ్యమిది. అలాగని ఇదేదో నిల్వ ఉన్న పాత బ్యాగుల్లోని బియ్యం కాదు. జూలైలో ఇచ్చిన బియ్యంలోనే పురుగులు కనిపిస్తున్నాయి. కొందరు అవి తీసేసి తింటుండగా.. కొన్నిచోట్ల తినకముందే పడేస్తున్నారు. పాత బియ్యం కారణంగా పురుగులు వచ్చాయని అధికారులు సమర్థించుకుంటే...కాదు కాదు కొత్తగా వచ్చిన బ్యాగుల్లో కూడా పురుగులు వస్తున్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

● సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర స్టూడెంట్స్ కిట్లు కూడా అరకొరగానే ఇచ్చారు. లక్షా 62వేల 316 మందికి గాను లక్షా 47వేల 952 మందికి కిట్లు ఇచ్చినట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. దీని ప్రకారం మరో 14,364 మందికి కిట్లు అందాల్సి ఉంది. యూనిఫాం చాలా మందికి ఇవ్వలేదు.

● ఆంక్షల్లేవు. నిబంధనలు ఉండవు. చదువుతున్న ప్రతీ ఒక్కరికీ తల్లికి వందనం ఇస్తామని చెప్పారు. ఇచ్చే సమయానికి రూ.10వేల ఆదాయం, 300 యూనిట్ల విద్యుత్ వినియోగం, భూములు, కార్లు, చిరు ఉద్యోగులు, తాత్కాలిక ఉద్యోగులు తదితర వారికి తల్లికి వందనం లేదని తేల్చి చెప్పేసింది. దీంతో జిల్లాలో వేలాది మంది తల్లికి వందనం పథకానికి దూరమయ్యారు.

● ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న స్వీపర్లను రాజకీయ దురుద్దేశంతో తీసేశారు. తొలుత జీతాలు నిలిపివేసి, ఆ తర్వాత రకరకాల సాకులు చూపించి వెళ్ల గొట్టారు. వారి స్థానంలో టీడీపీ జెండా పట్టుకున్న వారిని నియమించారు.

● నాడు నేడు కింద గత వైఎస్ జగన్ ప్రభుత్వం బడులు రూపు రేఖలు మార్చింది. ఈ ప్రభుత్వం కొత్తగా ఒక్క పాఠశాలను అభివృద్ధి చేయలేదు. పైసా కూడా ఖర్చు పెట్టలేదు. ఎంత దారుణమంటే గత ప్రభుత్వంలో కోట్లాది రూపాయలతో 800కి పైగా పాఠశాలల్లో చేపట్టిన పనులు ఆఖరి దశలో నిలిచిపోయాయి. ఇంకా లక్షలు, వేలల్లో ఖర్చు పెడితే పూర్తవుతాయి. కనీసం ఆ సొమ్ము కూడా ఖర్చు పెట్టకపోవడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.



● అట్టహాసంగా చేయాలని ఉపాధ్యాయులకు ఒత్తిళ్లు
● చాలీచాలని నిధులు కేటాయింపు
● ఇప్పటికే పాఠశాలల్లో అవస్థల చదువులు
● పూర్తిస్థాయిలో అందని కిట్లు
● మధ్యాహ్న భోజనంలో పురుగులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ప్రభుత్వ పాఠశాలల దయనీయ పరిస్థితులు తెలుసుకునేందుకు పై ఉదాహరణలు చాలు. కూటమి ప్రభుత్వం అటు పాఠశాలలు, విద్యార్థులను మోసం చేసింది. ఇటు ఉపాధ్యాయులను దగా చేసింది. అధికారంలోకి రాగానే ఉపాధ్యాయులకు కొత్త పీఆర్‌సీ, పెండింగ్ బకాయిలు అందిస్తామని చెప్పి ఇంతవరకు ఒక్క రూపాయి ఇవ్వలేదు. ఏదీ సక్రమంగా చేయలేదు. కానీ గొప్పల కోసం మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ అంటూ హడావుడి చేస్తోంది. దీనికే సమయమంతా కేటాయించడంతో పది రోజులుగా పాఠాలు చెప్పేవారు కరువయ్యారు.

ఏం ప్రగతి ఉందని...

గిన్నిస్ బుక్ రికార్డు కోసమని ఆర్భాటానికి పోతుందే తప్ప ఎవరికి ఉపయోగమో తెలియడం లేదు. పాఠశాలల సమస్యలు అలాగే ఉన్నాయి. విద్యార్థుల వసతులు అరకొరగానే ఉన్నాయి. సమకూర్చుతున్నవి కూడా నాసిరకంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో దేనిపైనా చర్చ పెట్టాలో తెలియని పరిస్థితి. పోనీ, విద్యార్థుల చదువుల ప్రగతి కోసం చర్చించడానికైనా అవకాశం ఉంటుందా? అంటే అదీ లేదు. ఇప్పటి వరకు సమ్మెటివ్(యూనిట్ పరీక్షలు) పరీక్షలు జరగలేదు. కనీసం జూన్‌కు సంబంధించిన సిలబస్ కూడా పూర్తవ్వలేదు. ఈ నేపథ్యంలో దేనికోసం ఉపాధ్యాయులతో తల్లిదండ్రులు సమావేశమవ్వాలో కూడా తెలియని పరిస్థితి.

చాలీచాలని నిధులు..

మెగాపేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహణకు స్కూల్ గ్రాంట్ నుంచి 10 శాతం ఖర్చు పెట్టాలని ఆదేశాలు ఇచ్చి చేతులు దులుపుకొంది. దాదాపు జిల్లాలో ఉన్న పాఠశాలల్లో రూ.5వేల నుంచి రూ.25వేల వరకు గ్రాంట్స్ ఉంటాయి. ఈ లెక్కన 10 శాతం తీసుకుంటే రూ. 500 నుంచి రూ. 2500 వరకు మాత్రమే నిధులు అందుబాటులో ఉన్నట్టు అవుతోంది. ఇవి ఎటూ సరిపోవు. తల్లిదండ్రులకు పోటీలు పెట్టమన్నారు. బహుమతులు ఇవ్వమన్నారు. షామియానాలు, కుర్చీలు, టాపర్స్ తల్లిదండ్రుల సన్మానానికి శాలువాలు వేయాలి. వచ్చిన వారందరికీ టీలు ఇవ్వాలి. ఇవన్నీ చేయాలంటే ఉపాధ్యాయుల జేబుల నుంచి పెట్టుకోవడమో లేదంటే దాతల సాయం తీసుకోవడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు. ఇక, ప్రభుత్వ కళాశాలలో కూడా పెట్టమన్నారు. అక్కడ పేరెంట్స్ కమిటీలు ఉంటే తప్ప నిధులు డ్రా చేయలేమని బ్యాంకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. దీంతో ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో ప్రిన్సిపాళ్లు అయోమయంలో పడ్డారు.

పునర్నిర్మాణం పేరిట విధ్వంసం..

పాఠశాలల్లో పునర్నిర్మాణం పేరుతో కూటమి ప్రభుత్వం విధ్వంస రచనకు దిగింది. మూడంచెల పాఠశాల విద్యా విధానాన్ని తొమ్మిది రకాల పాఠశాలలుగా విడదీసి బలహీనపరిచింది. సమీప భవిష్యత్‌లో ఫౌండేషన్ స్కూల్స్, ప్రాథమికోన్నత పాఠశాలలు కనుమరుగయ్యేలా చేసింది. ఇప్పటికే ఒకటో తరగతి, ఆరో తరగతిలో సున్నా అడ్మిషన్లతో పదుల సంఖ్యలో పాఠశాలలు ఉన్నాయి. 248 పాఠశాలలను ఫౌండేషన్ పాఠశాలలుగా పునర్నిర్మాణ ప్రక్రియలో ఏర్పాటు చేయగా 100కు పైగా పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలు లేకపోవడం గమనర్హం. ఆదర్శ ప్రాథమిక పాఠశాలల నెపంతో పంచాయతీ నుంచి క్లస్టర్ పరిధి వరకు విలీనం చేసి మూడు, నాలుగు, ఐదు తరగతులను కాగితాలపై తరలించారే తప్ప వాస్తవంగా విద్యార్థులను గుర్తించిన మోడల్ ప్రాథమిక పాఠశాలలకు తరలిరాకపోవడం వల్ల 183 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు స్థాయిని కోల్పోయాయి. ఈ విధ్వంస రచనతో గతేడాది కంటే జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 20వేల వరకు విద్యార్థులు తగ్గిపోయారు.

నిలదీసే అవకాశం..

విద్యార్థులకు ఎదురవుతున్న అవస్థలు, సంక్షేమం విషయంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు, పాఠశాలల పునర్నిర్మాణ ప్రక్రియతో నెలకొన్న ఇబ్బందులు, మధ్యాహ్న భోజనం తదితర విషయాలపై గురువారం జరిగే మీటింగ్‌లో తల్లిదండ్రులు నిలదీసే అవకాశం ఉంది. ఆ గుబులు ఉపాధ్యాయులకు పట్టుకుంది.

విద్యార్థులకు పాత ప్రోగ్రెస్ కార్డులు



విద్యార్థులకు సంబంధించిన పూర్తి సమాచారం తెలియజేసే హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను మెగా పేరెంట్స్ డే రోజున పంపిణీ చేయాలని ఆదేశించిన విద్యాశాఖ అధికారులు వాటిని పాఠశాల స్థాయికి పంపించడంలో నిర్లక్ష్యం వహించారు. రాష్ట్రస్థాయి నుంచి సరఫరా కావడం ఆలస్యమైందని చెబుతూ బుధవారం ఉదయం పాఠశాలలకు పంపించారు. ఈ కార్డులో విద్యార్థికి సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. విద్యార్థి పేరు, తల్లిదండ్రుల పేరు ఆధార్ కార్డు నెంబర్లతో పాటు బ్లడ్ గ్రూప్ తదితర వివరాలను నమోదు చేసేందుకు ఒక్కో విద్యార్థికి 20 నిమిషాల వరకు పట్టే అవకాశం ఉంటుంది. దీంతో ప్రోగ్రెస్ కార్డులను ఇప్పటికిప్పుడు సిద్ధం చేయలేమని ఉపాధ్యాయులు చేతులెత్తేశారు. విద్యాశాఖ అధికారులు తమ నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఉపాధ్యాయులకు కొన్ని సూచనలను చేశారు. ప్రోగ్రెస్ కార్డులను ఎవరూ పరిశీలించరని, అందువల్ల గత ఏడాదికి సంబంధించిన ప్రోగ్రెస్ కార్డులను కార్యక్రమంలో పంపిణీ చేసి కార్యక్రమం పూర్తయిన తర్వాత కొత్త కార్డులను సిద్ధం చేసుకోవాలని సూచించినట్లు తెలిసింది. అయితే గత ఏడాదికి సంబంధించిన విద్యార్థుల పేర్లతో ఉన్న ప్రోగ్రెస్ కార్డులను ఏ విధంగా పంపిణీ చేయాలో తెలియక ఉపాధ్యాయులు సతమతమవుతున్నారు.

తల్లులకు శఠగోపం..



తల్లికి వందనం పథకం పేరిట కూటమి ప్రభుత్వం మస్కా కొట్టింది. తల్లులు/సంరక్షకులను నిలువునా మోసం చేసింది. జిల్లాలో ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు 3.02 లక్షల మంది ఉన్నారు. వీరిలో ఒకటో తరగతి, ఇంటర్ ఫస్టియర్, సీబీఎస్‌ఈ, సెంట్రల్ స్కూల్ విద్యార్థులకు ఇప్పటి వరకు నయాపైసా లబ్ధి చేకూరలేదు. మిగిలిన వారికి కూడా రూ.15 వేలు వేస్తామని చెప్పి రూ.13 వేలతో సరిపెట్టేశారు. ఎంతమందికి లబ్ధి జమ కూరిందో సంబంధిత జిల్లా అధికారులకు సైతం ప్రభుత్వం సమాచారాన్ని చేరవేయలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. గత ఏడాది 2024–25 విద్యా సంవత్సరానికి గాను తల్లికి వందన పథకం కింద 3.05 లక్షల మంది విద్యార్థులకు రూ.457 కోట్లను కూటమి ప్రభుత్వం బాకీ ఉంది.

10 రోజులుగా చదువులు లేవు..



నిన్నమొన్నటి వరకు యోగా డే పేరుతో హడావుడి చేశారు. తాజాగా పేరెంట్స్ మీట్. విద్యార్థులు, తల్లిదండ్రుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమడటం తగదు. గిన్నిస్ రికార్డులకోసమని చెప్పి 10 రోజులుగా చదువులు సాగడంలేదు.

– పేడాడ కృష్ణారావు, డీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి

రికార్డుల కోసం మీటింగులా..



పాఠశాలల్లో సాధారణంగానే తల్లిదండ్రులతో రెండు మూడునెలలకు ఒకసారి సమావేశాలు నిర్వహిస్తుండేవాళ్లం. ఉన్నఫళంగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ తెరపైకి తెచ్చారు. బడుల్లో పీటీఎం సమావేశ ఏర్పాట్లతోనే సమయం సరిపోతోంది. రికార్డుల కోసం మీటింగులా ? సిగ్గుపడుతున్నాం.

– మజ్జి మదన్‌మోహన్, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

అంతా హడావుడే



మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ హడావుడి తప్ప ఫలితం శూన్యంగా కనిపిస్తోంది. ఇప్పటి వరకు ఎలాంటి పరీక్షలు జరగలేదు. పేరెంట్స్‌తో స్టూడెంట్స్ సెల్ఫీలు, ఫొటోలు, వీడియోల అప్‌లోడింగ్.. ఇలా చాలా తతంగమే ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు అంతలా ఆసక్తి చూపడంలేదు.

– చౌదరి రవీంద్ర, యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు

ఆయువు తీసిన ఆపరేషన్లు!



పట్ట అరుణ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు



అంబులెన్స్‌లో కొర్లాపు ధనలక్ష్మి మృతదేహం

● బుడితి సీహెచ్‌సీలో ఆపరేషన్లు వికటించి ఇద్దరు బాలింతలు మృతి
● ఇద్దరూ జలుమూరు మండలవాసులే
● మృతదేహాలతో కుటుంబ సభ్యుల ఆందోళన
● ఆస్పత్రిని సందర్శించిన డీఎంహెచ్‌ఓ, డీసీహెచ్‌ఎస్



పట్ట అరుణ (ఫైల్)



కొర్లాపు ధనలక్ష్మి (ఫైల్)

సారవకోట:

జన్మనిచ్చిన బిడ్డలను తనివితీరా చూడకముందే ఇద్దరు బాలింతలు తనువు చాలించారు. ఆనందంతో కళకళలాడాల్సిన రెండు కుటుంబాల్లో విషాదం మిగిల్చి వెళ్లిపోయారు. ఈ హృదయ విదారకర ఘటనకు సారవకోట మండలం బుడితి బుడితి కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) కారణంగా నిలిచింది. ఇక్కడ జరిగిన ప్రసూతి ఆపరేషన్లు వికటించడంతో ఇద్దరు బాలింతలు మృతిచెందడం జిల్లావ్యాప్తంగా కలకలం రేపింది. బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..

ఏం జరిగిందో..

జలుమూరు మండలం పాగోడు గ్రామానికి చెందిన కొర్లాపు ధనలక్ష్మి (21)కి నెలలు నిండటంతో ప్రథమ కాన్పు కోసం బుడితి సీహెచ్‌సీకి సోమవారం తీసుకెళ్లారు. ఆమెను పరీక్షించిన వైద్యురాలు శోభారాణి ప్రసూతి ఆపరేషన్ చేయగా మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ అప్పటికి క్షేమంగానే ఉన్నారు. అనంతరం ధనలక్ష్మి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వైద్య సిబ్బంది, డ్యూటీ డాక్టర్లను సంప్రదించగా ఆమెను శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో శ్రీకాకుళం తరలించారు. వైద్యసేవలు పొందుతూ మంగళవారం రాత్రి ధనలక్ష్మి మృతి చెందింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాగోడు రోడ్డుపై బుధవారం ఉదయం ఆందోళనకు దిగారు. బుడితి వైద్యురాలు చేసిన ఆపరేషన్ వికటించడం వల్లే తమ బిడ్డ మృతి చెందిందని ధర్నా చేపట్టారు.

రెండో కాన్పు కోసం ఆస్పత్రిలో చేరి..

అదే మండలం యలమంచిలి గ్రామానికి చెందిన పట్ట అరుణ(24)ను కూడా సోమవారం రెండో కాన్పు కోసం బుడితి ఆసుపత్రిలో చేర్పించారు. ఈమెకు వైద్యురాలు శోభారాణి ప్రసూతి ఆపరేషన్ చేయగా కుమారుడికి జన్మనిచ్చింది. ఆపరేషన్ అనంతరం తల్లి, బిడ్డ క్షేమంగానే ఉన్నారు. అనంతరం బాలింతకు యూరిన్ రాకపోవడంతో కుటుంబ సభ్యులు వైద్య సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. బాలింతను పరీక్షించిన వైద్య సిబ్బంది ఆమెను కూడా శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించడంతో కుటుంబ సభ్యులు మంగళవారం అంబులెన్స్‌లో శ్రీకాకుళం తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించిందని అక్కడి వైద్య సిబ్బంది తెలిపారు. అనంతరం ఆమె కూడా మంగళవారం రాత్రి మృతి చెందింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు బుడితి జంక్షన్లో మృతదేహాన్ని ఉంచి ఆందోళనకు దిగారు. బుడితి వైద్యురాలు చేసిన ఆపరేషన్ కారణంగా అరుణ మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఇరు కుటుంబాల బంధువులు, గ్రామస్తులు సారవకోట పోలీసుస్టేషన్‌కు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు.. బుడితి సీహెచ్‌సీ వైద్యురాలు, మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడారు. రాజీ కుదరడంతో నిరసన విరమించారు.

మూడు ఆపరేషన్లు.. ఇద్దరు మృతి

బుడితి సీహెచ్‌సీ వైద్యురాలు శోభారాణి సోమవారం కొర్లాపు ధనలక్ష్మి, పట్ట అరుణతో పాటు సక్కా నీలవేణికి కూడా ప్రసూతి ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ వికటించడంతో ధనలక్ష్మి, అరుణలు మృతి చెందారు.

మృతికి గల కారణాలపై ఆరా..

విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌ఓ అనిత, ఇన్‌చార్జి డీసీహెచ్‌ఎస్ సూర్యారావు సీహెచ్‌సీని సందర్శించారు. వైద్యులు, సిబ్బందితో మాట్లాడి మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. నివేదికను కలెక్టర్‌కు, ఉన్నతాధికారులకు అందించనున్నట్లు వారు తెలిపారు.

గత నెలలోనే విధుల్లో చేరిన గైనకాలజిస్టు..

బుడితి సీహెచ్‌సీలో గైనకాలజిస్టుగా విధులు నిర్వర్తిస్తున్న శోభారాణి బదిలీల్లో భాగంగా గత నెల 23నే విధుల్లో చేరారు. గత గైనకాలజిస్టు హయాంలో ఇంత వరకు ఇటువంటి ఘటనలు జరగలేదని స్థానికులు చెబుతున్నారు.

ఆపరేషన్ బాగానే చేశా..



ఈ విషయమై గైనకాలజిస్టు శోభారాణి స్పందిస్తూ సోమవారం మూడు ఆపరేషన్లు విజయవంతంగా చేశామని, అప్పుడు తల్లీ బిడ్డలు క్షేమంగా ఉన్నారన్నారు. అయితే వేలాది మందిలో ఒకరికో, ఇద్దరికో వచ్చే సమస్య ఆపరేషన్ అనంతరం ఇద్దరు బాలింతలకు వచ్చిందని, వెంటనే స్పందించి శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించామన్నారు.

– శోభారాణి, గైనకాలజిస్టు, బుడితి సీహెచ్‌సీ

● కదం తొక్కిన కార్మిక లోకం



కార్మిక హక్కుల పరిరక్షణ కోరుతూ బుధవారం జిల్లావ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్మిక చట్టాల మార్పు, లేబర్ కోడ్‌ల రద్దు, పని గంటల పెంపు తదితర అంశాలకు వ్యతిరేకంగా ఈ సమ్మె జరిగింది. దీనిలో భాగంగా జిల్లా కేంద్రంలో కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్ల ఆధ్వర్యంలో డైమండ్ పార్కు నుంచి ఏడురోడ్ల కూడలి వరకు మహాప్రదర్శన చేపట్టారు. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

– శ్రీకాకుళం పీఎన్ కాలనీ

● మధ్య వర్తిత్వమే మేలు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్ : కేసులను మధ్య వర్తిత్వం ద్వారా పరిష్కరించడం వల్ల సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు సమన్యాయం లభిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. బుధవారం జిల్లా కోర్టు సమావేశ భవనంలో మధ్యవర్తిత్వ న్యాయవాదుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు మధ్యవర్తిత్వ విధానాన్ని మరింత సమర్థంగా అమలు చేసి ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలన్నారు. పెండింగ్ కేసులు త్వరగా పరిష్కారమయ్యేందుకు ఇది మేలైన మార్గమన్నారు.సీనియర్ న్యాయవాదులు వి.పి.తనకచన్, పి.జి.సురేష్‌లు మధ్యవర్తిత్వ విధానం, ప్రయోజనాలు, జాగ్రత్తలు వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.హరిబాబు, మధ్యవర్తిత్వ న్యాయవాదులు పాల్గొన్నారు.

● రెడ్‌క్రాస్‌కు ఉత్తమ సేవా పతకం



గవర్నర్ నుంచి బంగారు పతకం అందుకున్న కలెక్టర్ స్వప్నికల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం జిల్లా రెడ్‌క్రాస్‌కు ఉత్తమ సేవా పతకం వరించింది. ఈ మేరకు బుధవారం విజయవాడలో జరిగిన రెడ్‌క్రాస్ వార్షిక సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా బంగారు పతకాన్ని కలెక్టర్ స్వప్నికల్ దినకర్ పుండ్కర్ అందుకున్నారు. జిల్లాలో రెడ్‌క్రాస్ ద్వారా జరుగుతున్న విస్తృతమైన సేవలకు గాను పతకాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్‌క్రాస్ చైర్మన్ వై.డి.రామారావు, వైస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, సెక్రటరీ ఎ.కె.పరీడా, కోశాధికారి రామచంద్రరాజు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాముకాటుతో బాలిక మృతి


షన్విత(ఫైల్)

కవిటి: మండలంలోని పాత శిలగాం పూడివీధికి చెందిన గొనప షన్విత(11) అనే బాలిక పాముకాటుతో మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సోమవారం అర్ధరాత్రి ఇంట్లో పడుకొని ఉన్న సమయంలో పాము కాటు వేసింది. దీంతో బాలిక ఉదయం లేచిన తర్వాత విపరీతంగా వాంతులు చేసుకుంటూ అపస్మారక స్థితికి వెళ్లడంతో సోంపేట ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యమందించారు. పరిస్థితి విషమించడంతో బాలిక చికిత్స పొందుతూనే మంగళవారం మృతి చెందింది. శిలగాం ఉన్నత పాఠశాలలో బాలిక ఆరో తరగతి చదువుతోంది.

రోడ్డు ప్రమాదంలో కార్యదర్శికి గాయాలు


గాయాలతో పడి ఉన్న కార్యదర్శి అప్పారావు

మెళియాపుట్టి: మండలంలోని చాపర గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న చింతల అప్పారావు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం సాయంత్రం విధులు ముగించుకుని స్వగ్రామం కొరసవాడకు వెళ్లే క్రమంలో ఒడిశా రామసాగరం గ్రామం వద్ద ఆయన ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయారు. దీంతో అక్కడే ఉన్నటువంటి కొంత మంది వ్యక్తులు 108కు సమాచారం అందించారు. అక్కడి నుంచి ఒడిశా పర్లాఖిమిడి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో కుటుంబ సభ్యులు శ్రీకాకుళం తరలించినట్లు తెలుస్తోంది. అయితే ప్రమాదానికి గల కారణాలు తెలియలేదు.

పాముల సయ్యాట



కొత్తూరు: మండల కేంద్రంలోని ఎన్ఎస్ కాలనీలో మంగళవారం రాత్రి పాములు సయ్యాటాడుతూ కనిపించాయి. కాలనీలోని ప్రజలంతా ఆసక్తిగా గమనించారు. అయితే ప్రజలు సంచరిస్తున్న ప్రాంతాల్లో ఇటువంటి ఘటన జరగడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

గంజాయితో ఇద్దరు యువకులు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సూర్యనారాయణ

కాశీబుగ్గ : పలాస రైల్వేస్టేషన్ సమీపంలో ఇద్దరు వ్యక్తులు సుమారు నాలుగు కేజీల గంజాయి తరలిస్తూ కాశీబుగ్గ పోలీసులకు పట్టుబడ్డారు. తమిళనాడు రాష్ట్రం చెన్నైకు చెందిన రామ్మూర్తి దినేష్‌కార్తీక్ ఒడిశాలో 4 కేజీల గంజాయి కొనుగోలు చేసి తిరిగి చెన్నై వెళ్లేందుకు పలాస రైల్వే స్టేషన్‌కు వెళ్తున్న క్రమంలో కాశీబుగ్గ పోలీసులు పట్టుకున్నారు. కటక్‌కు చెందిన చిత్తరంజన్ దాస్ అనే వ్యక్తి పర్లాకిమిడిలో 2 కేజీల గంజాయిని కొనుగోలు చేసి కటక్ వెళ్లేందుకు పలాస రైల్వే స్టేషన్ వెళ్తున్న క్రమంలో కాశీబుగ్గ పోలీసులకు పట్టుబడ్డాడు. వీరిద్దరి నుంచి 6 కేజీల గంజాయి, మొబైల్ ఫోన్‌ను స్వాధీనపరచుకున్న పోలీసులు కేసు నమోదుచేసి ఇరువురిని కోర్టులో హాజరుపరుస్తున్నట్లు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ వెల్లడించారు.

అయ్యో.. అన్నదాత..!



- పత్తా లేకుండా పోయిన సీఎం చంద్రబాబు హామీ
- మూలకు చేరిన ఈదుపురం ఎత్తిపోతల పథకం
- మొదలైన ఖరీఫ్ కష్టాలు

ఇచ్ఛాపురం రూరల్: 'ఖరీఫ్ నాటికి ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. రైతుల వినతి మేరకు మూలకు చేరిన ఈదుపురం ఎత్తిపోతల పథకాన్ని రూ.9 కోట్లతో పునరుద్ధరిస్తాం' అని గతేడాది నవంబర్ 1వ తేదీన ఈదుపురం గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పిన మాటలు ఇవి. ఈ మాటలు చెప్పి నేటికి 8 నెలలు కావస్తున్నా ఎత్తిపోతల పథకం కోసం ఇప్పటివరకు నయా పైసా కూడా విడుదల చేయలేదు. దీంతో సీఎం హామీపై ఆశలు పెట్టుకున్న అన్నదాతకు అవస్థలు తప్పడం లేదు.

1,200 ఎకరాలకు సాగునీరు

ఇచ్ఛాపురం మండలం కొఠారీ, పూర్ణాటకం, పత్రిపుట్టుగ, ధర్మపురం గ్రామాలతో పాటు కవిటి మండలంలోని ఖైరిపురం, వింధ్యగిరి, రాజపురం, లండారిపుట్టుగ గ్రామ పరిసర ప్రాంతాల్లో ఉండే 1200 ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించే ఏకైక ఎత్తిపోతల పథకం జైకిసాన్ ఎత్తిపోతల పథకం. ఈదుపురం బాహుదా నది పక్కన 2004లో నిర్మించారు. కేవలం వర్షాధారంపై పండించే ఈ ప్రాంత రైతులకు జైకిసాన్ ఎత్తిపోతల పథకం వరంగా మారింది. రబీ, ఖరీఫ్ సీజన్లలో రైతులు సక్రమంగా పంటలను పండించుకునేవారు. అయితే 2009లో కురిసిన భారీ వర్షాలకు బాహుదా నది ఉప్పొంగడంతో ఎత్తిపోతల పథకం నీట మునిగింది. దీంతో యంత్రాలు పాడైపోయాయి. అయితే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయడంతో మరో ఐదేళ్ల పాటు రైతులకు సాగునీటి ఇబ్బందులు తీరాయి. 2018 అక్టోబర్‌లో వచ్చిన తిత్లీ తుఫాన్‌కు బాహుదా వరద నీటిలో ఎత్తిపోతల పథకం 15 రోజుల పాటు ఉండిపోవడంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు ఎత్తిపోతల పథకానికి సంబంధించి యంత్రాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో అప్పటినుంచి ఏడేళ్లుగా 1200 ఎకరాలకు సాగునీరు అందకపోవడంతో అక్కడి రైతులు అవస్థలు పడుతున్నారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీతో ఈ ఏడాది ఖరీఫ్ కష్టాల నుంచి గట్టెక్కుతాం అనుకున్న రైతులకు అడియాసలే మిగిలాయి. రూ.9 కోట్లతో ఎత్తిపోతల పథకానికి పూర్వ వైభవం తెస్తామన్న ఆయన హామీ నీటిమూటగా మిగిలిపోయింది.


వర్షాలపై ఆశలతో పొలాలను బాగు చేస్తున్న ధర్మపురం రైతులు

సాగునీరు లేక బీడుగా మారిన కొఠారీలో పంట పొలాలు


మూలకు చేరిన ఈదుపురం ఎత్తిపోతల పథకం

చుక్క నీరు లేదు

ఈదుపురం ఎత్తిపోతల పథకానికి ఆనుకొని ఉన్న భూములకు చుక్క సాగునీరు లేకుండా పోయింది. దీంతో రైతులు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంతంలో నాకు రెండు ఎకరాల పంట పొలం ఉంది. గతంలో ఎత్తిపోతల పథకం ద్వారా రబీ, ఖరీఫ్ సీజన్లలో సాగునీరు అందడం మూలంగా ఆనందంగా పంటలు పండించుకునేవాళ్లం. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా పోయింది. ప్రభుత్వం సత్వరమే పథకాన్ని పునరుద్ధరిస్తే రైతులకు మేలు జరుగుతుంది.

– సంధాన పూర్ణచంద్రుడు, డి.గొనపపుట్టుగ, కవిటి

సీఎం హామీ ఏమైంది

సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీకే పత్తా లేకుండా పోయింది. రూ.9 కోట్లతో జైకిసాన్ ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధించడం జరుగుతుందని ఆయన చెప్పడంతో వందలాది మంది రైతులు సంతోషించారు. ఈయన హామీకి నేటికి ఎనిమిది నెలలు కావస్తోంది. 2016లో కొఠారీ ఉమ్మడి చెరువు వద్ద పైపులైన్ ధ్వంసం కావడంతో శివారు ప్రాంతాలకు సాగునీరు అందకుండా పోయింది. రైతుల పరిస్థితిని అర్థం చేసుకొని పథకానికి జీవం పోస్తే మంచి జరుగుతుంది.

– దుక్క ధనలక్ష్మి, సర్పంచ్, కొఠారీ, ఇచ్ఛాపురం

అన్నం తినలేక.. పస్తులు ఉండలేక

- మధ్యాహ్న భోజనంలో పురుగులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు


పాఠశాలలో విద్యార్థులకు అన్నం వడ్డిస్తున్న దృశ్యం

కంచిలి: మండలంలోని కంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వండుతున్న అన్నంలో పురుగులు దర్శనమిస్తున్నాయి. ఇక్కడ సన్నబియ్యంతో వండిన అన్నంలో కొద్ది రోజులుగా పురుగులు వస్తుండడంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం కూరగాయల అన్నం, ఉడకబెట్టిన కోడిగుడ్డు, బంగాళ దుంపలు కూర, వేరుశనగ చిక్కీను వడ్డించారు. అయితే కూరగాయల అన్నంలో కొందరు విద్యార్థులకు పురుగులు దర్శనమిచ్చాయి. ఇక్కడ కొద్దిరోజులుగా ఇదేవిధంగా అన్నంలో తెల్లటి పురుగులు వస్తున్నాయని విద్యార్థులు, ఉపాధ్యాయులు చెబుతున్నారు.

రెండో 'సారీ'

ఇటీవల ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి వెంకటేశ్వర పాణిగ్రాహి బియ్యాన్ని తనిఖీ చేసి, మొదటి బ్యాచ్‌లో సరఫరా చేసిన రెండు ప్యాకెట్ల పాత నిల్వ ఉన్న బియ్యాన్ని వెనక్కి తీసుకెళ్లారు. అయితే రెండో బ్యాచ్‌లో మళ్లీ సరఫరా చేసిన బియ్యంలో కూడా తెలుపు, నలుపు రంగుల్లో పురుగులు వస్తున్నాయని వంట చేస్తున్న ఏజెన్సీ మహిళలు తెలిపారు. దీనిపై పాఠశాల హెచ్‌ఎంకు సమాచారం ఇవ్వడంతో ఆయన స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఇలా ప్రతిరోజు విద్యార్థులకు పెడుతున్న అన్నంలో పురుగులు వస్తుండడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కూరగాయల అన్నంలో పురుగు



బుధవారం పాఠశాల మధ్యాహ్న భోజనం మెనూలో వడ్డించిన కూరగాయల అన్నంలో నల్లటి పురుగులు వచ్చాయి. ఈ మధ్య కాలంలో ప్రతిరోజూ ఇదే విధంగా పురుగులు వస్తున్నాయి. దీంతో సరిగా అన్నం తినలేకపోతున్నాం.

– ఎల్.చందు, ఆరో తరగతి విద్యార్థి

అన్నం తినలేకపోతున్నాను



ప్రతిరోజు మధ్యాహ్న భోజనంలో పురుగులు వస్తున్నాయి. ఈ అన్నం తినలేకపోతున్నాను. తింటుంటే ముద్ద దిగడం లేదు. ఆకలికి తట్టుకోలేక తినక తప్పడం లేదు.

– పి.గంగాధర్, ఆరో తరగతి విద్యార్థి

తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్నాం



గత కొద్దిరోజులుగా సన్న బియ్యం సరఫరా చేసిన వాటిలో పురుగులు వస్తున్నాయి. ఈ విషయంపై విద్యార్థులు, పాఠశాల వంట ఏజెన్సీవారి నుంచి ఫిర్యాదులు అందడంతో స్వయంగా పరిశీలించాను. దీంతో బియ్యాన్ని చేటలతో శుభ్రం చేసి వండమని సూచించాను. అయినప్పటికీ తెలుపు రంగు పురుగులు వండిన తర్వాత బయటపడుతున్నాయి. బియ్యాన్ని మార్చాల్సిందిగా తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్నాం.

– ఎస్.చాణక్య, హెచ్‌ఎం, కంచిలి జెడ్పీహెచ్ స్కూల్

నాటుసారా కేసులో మహిళకు జైలు శిక్ష

పలాస: మండలంలోని రెంటికోట గ్రామానికి చెందిన కబోది తులసికి నాటుసారా కేసులో 12 నెలల జైలుశిక్షతో పాటు రూ.2 లక్షల జరిమానా విధిస్తూ జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి బుధవారం తీర్పునిచ్చారు. ఈ విషయాన్ని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.మల్లికార్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2022 ఏప్రిల్ 16న ఆమె వద్ద అక్రమంగా 5 లీటర్ల నాటుసారా ఉండడంతో అప్పటి సబ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.రమేష్ వాదించారు. ఈ కేసు నేరం రుజువు కావడంతో తుది తీర్పును ఇచ్చారని ఆయన తెలిపారు.

చీకట్లో వైద్యారోగ్య శాఖ కార్యాలయం

- వారం రోజులుగా సింగిల్ ఫేజ్ విద్యుత్‌తో ఉద్యోగుల అవస్థలు


డీసీహెచ్ఎస్ కార్యాలయంలో సిబ్బంది లేని దృశ్యం

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కార్యాలయం అంధకారంలో ఉంది. నాలుగు అంతస్తుల్లో వివిధ హోదాల్లో వైద్యాధికారుల ఛాంబర్లు పనిచేస్తుండగా.. ఏకంగా వారం రోజులు నుంచి ఎక్కడా పూర్తిస్థాయిలో విద్యుత్ సప్లయ్ లేకుండాపోయింది. దీంతో వైద్య శాఖలో కీలక ఫైళ్లు పెండింగ్‌లో ఉండాల్సి వస్తోంది. విద్యుత్ పూర్తిస్థాయి సప్లయ్ లేకపోవడంతో సింగిల్ ఫేజ్ అవస్థలు ఉద్యోగులను తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తున్నాయి. నిత్యం వందలాది మంది రాకపోకలతో హడావుడిగా ఉండాల్సిన కార్యాలయంలో కంప్యూటర్లు పని చేయ్యక నిత్యం ఉన్నతాధికారులకు పంపాల్సిన నివేదికలు కూడా పెండింగ్‌లో పడ్డాయి. కొందరు కంప్యూటర్ ఆపరేటర్ల సొంత ల్యాప్‌ట్యాప్‌ల ద్వారా కొంత మేరకు ఎమర్జెన్సీ పనులు చేపడుతున్నారు. ప్రస్తుతానికి సింగిల్ ఫేజ్ వలన కొన్ని స్విచ్ బోర్డులు మాత్రమే పని చేస్తుండడంతో అక్కడికి డెస్క్‌టాప్ కంప్యూటర్లను తీసుకుని వెళ్లి ఉద్యోగులు విధులు నిర్వర్తించాల్సి వస్తుంది. అయినప్పటికీ విద్యుత్ అవస్థలపై సంబంధిత విద్యుత్ శాఖకు ఇంతవరకు ఎవరూ ఫిర్యాదులు చేయకపోవడం గమనార్హం. ఇదిలా ఉండగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో కొందరు ఉద్యోగులు మార్నింగ్ హాజరు వేసుకుని ఎంచక్కా సొంత పనుల్లో బిజీ అవుతున్నట్లు తెలుస్తోంది. మరికొందరు కార్యాలయంలో విధులు చేపట్టకుండా బయటే తిరుగుతున్నట్లు సమాచారం. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి, జిల్లా వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న డీసీహెచ్ఎస్ అధికారి కూడా ఇదే భవనంలో ఉంటున్నప్పటికీ.. విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా పూర్తిస్థాయి విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టాలని సిబ్బంది కోరుతున్నారు.

మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని కానుకుర్తివారి వీధిలో భార్యతో మనస్పర్థల కారణంగా బుధవారం ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు వెల్లడించారు. కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం మధురపేటకు చెందిన మధుర శ్రావ్య, నాగేంద్రలు మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుని ఉపాధి నిమిత్తం శ్రీకాకుళం నగరానికి వచ్చారు. వీరికి సంవత్సరం బాబున్నాడు. ఆరునెలల నుంచి బట్టల షాపులో పనిచేస్తున్న నాగేంద్ర ఒక అమ్మాయితో తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండడాన్ని భార్య శ్రావ్య గమనించి మంగళవారం రాత్రి అడిగింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన నాగేంద్ర బుధవారం భార్య నిద్రలో ఉండగా స్లాబ్ హుక్‌కి చున్నీతో ఉరివేసుకున్నాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

ఎట్టకేలకు..!

- జాబులిస్తానని నమ్మించిన వ్యక్తి అరెస్టు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా సివిల్ సప్లయ్ కార్పొరేషన్ సంస్థలో తాను తప్పుడు ధ్రువపత్రాలతో ఆడిటింగ్ సెక్షన్‌లో జాబ్ సంపాదించడమే కాకుండా, అదే కార్యాలయంలో జాబులిప్పిస్తానని నమ్మించి రూ.59 లక్షలకు టోపీ వేశాడు విశాఖ ఏ-కాలనీకి చెందిన కొండాల లోకేశ్వరరావు. కార్యాలయంలో ఐదుగురు వ్యక్తులు, వర్క్ ఫ్రం హోమ్ పేరిట ముగ్గురు మహిళలతో 18 నెలలు పనిచేయించుకుని డబ్బులివ్వకపోవడంతో గతేడాది డిసెంబరులో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేయగా, ఎట్టకేలకు రెండో పట్టణ పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. సీఐ పి.ఈశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. సూర్యమహల్ సమీపంలో ఉన్న స్టేట్ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ లిమిటెడ్ కంట్రోల్ రూమ్ ఆడిటింగ్ సెక్షన్‌లో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన తప్పుడు ధ్రువపత్రాలతో 2021లో లోకేశ్వరరావు జాబ్ సంపాదించాడు. అనంతరం ఈజీగా సంపాదించాలనే ఉద్దేశంతో జాబ్‌లో చేరిన ఆరునెలలు దాటాక పలువురిని అదే కార్యాలయంలో పర్సనల్ అసిస్టెంట్లుగా, అటెండర్లుగా జాబ్ లిప్పిస్తానని నమ్మించాడు. దీంతో ఆడంగివారి వీధికి చెందిన పూతి తిరుమలరావు లోకేష్‌ను 2022లో ఆశ్రయించాడు. తనకి, తన భార్య, బావమ్మర్ది, సోదరి వరసయ్యే మహిళకు జాబ్‌లు ఇప్పించాలని కోరడంతో సుమారు రూ. 25 లక్షలు ఇవ్వాల్సి ఉంటుందని లోకేష్ చెప్పారు. దీంతో పలుమార్లు ఫోన్ పే, చేతికి అతడికి డబ్బులు అందించారు.

ఫేక్ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చి..

అక్కడికి కొద్ది రోజుల్లో ఫేక్ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చి జాయిన్ చేసుకున్నాడు. దర్జాగా కార్యాలయంలోనే ఒక రూమ్‌ని తనకు అడ్డాగా మార్చుకుని అక్కడే కొందరిని కూర్చోబెట్టి పని చేయించడమే కాకుండా, మహిళలను వర్క్ ఫ్రం హోం పేరిట వారి వారి ఇళ్లల్లో వర్క్ చేయించేవాడు. వీరిని చూసి మరో నలుగురు ఆశ్రయించడంతో వారి వద్ద నుంచి సొమ్ము తీసుకుని ఫేక్ ఆర్డర్లు ఇచ్చి సుమారు 18 నెలలు పనిచేయించుకొని జీతం ఎగ్గొట్టాడు. జీతం కోసం అడిగితే ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో పాటు అక్కడికి కొద్దిరోజుల్లోనే పరారవ్వడంతో గతేడాది డిసెంబర్‌లో పూతి తిరుమలరావు, మరికొంతమంది బాధితులు పోలీసులను ఆశ్రయించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. అయితే దీనిపై తమకు ఎటువంటి సంబంధం లేదని కార్యాలయ అధికారులు చెప్పినట్లు సమాచారం.

బరితెగించిన ఆక్రమణదారులు


ఆక్రమించిన స్థలం ఇదే...

సంతబొమ్మాళి: మండలంలోని పోతునాయుడుపేట గ్రామంలో ఆక్రమణదారులు బరితెగించారు. సాగునీటి కాలువ, రోడ్డుకు మధ్య ఉన్న సుమారు 30 సెంట్లు స్థలం కబ్జా చేశారు. ఆక్రమించిన స్థలంలో ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వం వేసిన తాగునీటి బోరును పీకేసి ఆనవాలు లేకుండా చేశారు. దీంతో తాగునీటికి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఆక్రమణదారులను గ్రామస్తులు ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడడంతో భయపడి ఫిర్యాదు కూడా చేయలేదు. దీంతో పాటు రోడ్డుకు అనుకొని ఉన్న బెర్మ్‌తో పాటు సాగునీటి కాలువ గట్టును కూడా ఆక్రమించి మట్టిని వేసి కబ్జా చేశారు. ఆక్రమించిన స్థలంలో విద్యుత్ స్తంభాలు ఉండడంతో అవి కూడా తొలగించమని సంబంధిత కాంట్రాక్టర్‌తో ఆక్రమణదారులు గొడవపడిన సంఘటనలు ఉన్నాయి. ఆక్రమించిన స్థలంలోని 11 సెంట్లను వేరొక వ్యక్తికి ఆక్రమణదారులు అమ్మి తప్పుడు సర్వే నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేయించారని పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనిపై రెవెన్యూ ఉన్నతాధికారులు లోతుగా దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. తహసీల్దార్ హేమసుందర్‌ను దీనిపై వివరాలు అడుగగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

17న చలో విజయవాడ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీసీ సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జూలై 17న విజయవాడలో జరిగే జాతీయ బీసీ సంక్షేమ సంఘం సమావేశాన్ని విజయవంతం చేయాలని సంఘ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని యాదవ సంక్షేమ సంఘం కార్యాలయంలో బుధవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ బీసీలంతా ఐక్యంగా ఉంటేనే హక్కులు సాధించగలమన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు అమీరుల్లా బేగ్, గద్దిబోయిన కృష్ణయాదవ్, త్రినాథ రెడ్డి, కిల్లాన శ్రీనివాస్, తుళ్లూరు, లక్షణరావు, పంచిరెడ్డి కృష్ణారావు, మెహర్, మురపాల రామారావు, గాంధీ, రౌతు మోహన్‌రావు, రంగాజీ దేవ్, కలగ గోపాల్ యాదవ్, గుత్తి చిన్నరావు, కణా వెంకటరావు, కాయితీ వెంకటరమణ, కలగ లక్ష్మణరావు, వంజరాపు రాజులు, అ.రాజేష్, తంగి యర్రమ్మ, దుర్గ ప్రసాద్, శిమ్మ సూర్యం పాల్గొన్నారు.

గెజిట్ విడుదలలో జాప్యమెందుకో?

ఆమదాలవలస: విశాఖపట్నం కేంద్రంగా 'సౌత్ కోస్ట్ రైల్వే' స్థాపించే క్రమంలో కేంద్ర ప్రభుత్వం, రైల్వే మంత్రిత్వ శాఖ, క్యాబినెట్ ఆమోదం జరిగి ఏళ్లు గడుస్తున్నా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం విచారకరమని సౌత్ కోస్ట్ రైల్వే మజ్దూర్ యూనియన్ (విశాఖపట్నం) జనరల్ సెక్రటరీ చోడవరపు శంకరరావు, స్థానిక మజ్దూర్ యూనియన్ నాయకులు బుధవారం ప్రకటన విడుదల చేశారు. నోటిఫికేషన్ విడుదల చేసి రైల్వే జోన్ కార్యకమాలు తక్షణం ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

మాట తప్పిన నాయకులను నిలదీద్దాం..!


ఆమదాలవలస: క్యూ ఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


కాశీబుగ్గ: ప్రమాణ స్వీకారం చేస్తున్న పార్టీ అనుబంధ విభాగాల నాయకులు

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మాట తప్పిన కూటమి నాయకులను నిలదీద్దామని వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. జిల్లాలోని పలాస, ఆమదాలవలస నియోజకవర్గాల్లో ఆ పార్టీ విస్తృతస్థాయి సమావేశాలను బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్దామన్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ, పార్టీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు కుంభా రవిబాబు, మాజీ డిప్యూటీ సీఎం, పార్టీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ స్పీకర్, పార్టీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాం, మాజీ మంత్రి, పార్టీ పలాస నియోజకవర్గ సమన్వయకర్త సీదిరి అప్పలరాజు, పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, పార్టీ తూర్పు కాపు కుల రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. – ఆమదాలవలస/కాశీబుగ్గ